సాక్షి
ప్రకాశం
మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



లారీని ఢీకొని యువకుడు మృతి

ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టిన యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన జాతీయ రహదారిపై సింగరాయకొండ మండలంలో చోటుచేసుకుంది. - 8లో..



ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై ఏకాగ్రత

విద్యార్థులంతా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుని శ్రద్ధగా చదువుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
32/23

వాతావరణం

ఉదయం పొగమంచు ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎట్టకేలకు శివాచారి మృతదేహానికి అంత్యక్రియలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వైశ్య బ్యాంక్ రోడ్డులో ఆస్తి కోసం అత్తాకోడళ్ల మధ్య తలెత్తిన వివాదం కారణంగా హయగ్రీవ శివాచారి అనే వ్యక్తి మృతదేహం మూడు రోజులుగా ఇంటి ముందే ఉన్న విషయం విధితమే. హైదరాబాద్‌లో మృతిచెందిన శివాచారిని భార్య ఈశ్వరమ్మ తన కుమారుడితో కలిసి గిద్దలూరులోని అత్త సుబ్బలక్ష్మమ్మ ఇంటి వద్దకు తీసుకొచ్చింది. అంత్యక్రియలు నిర్వహించకముందే ఆస్తి విషయమై వాదన జరగడంతో సుబ్బలక్ష్మమ్మ తన కుమార్తెతో కలిసి ఇంటికి తాళం వేసి అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఇంటి ముందే భర్త మృతదేహంతో ఈశ్వరమ్మ ఉండిపోయింది. సమాచారం అందుకున్న సీఐ కె.సురేష్, తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డిలు సుబ్బలక్ష్మమ్మకు ఫోన్ చేసి ఇంటి వద్దకు రావాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో సుబ్బలక్ష్మమ్మ సోమవారం వేకువజామున వచ్చి ఇంటి తాళం తీసింది. అధికారులు, నగర పంచాయతీ సిబ్బంది సహాయంతో శివాచారి మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించారు. మూడు రోజులుగా ఇంటి ముందు రోడ్డుపై ఉంచిన మృతదేహాన్ని తరలించడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఆస్తితో పాటు అందరూ ఉన్నప్పటికీ శివాచారి మృతదేహాన్ని నగర పంచాయతీ సిబ్బందితో తరలించడంపై అతని భార్య, తల్లి, సోదరి తీరును పలువురు విమర్శించారు.

నెట్‌బాల్ జట్ల ఎంపిక నేడు

ఒంగోలు: నెట్‌బాల్ ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి జూనియర్ విభాగం బాలబాలికల జట్లను ఈ నెల 11వ తేదీ దొనకొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిక చేయనున్నట్లు ప్రకాశం జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కృష్ణారెడ్డి, ఐపీ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారుల వయస్సు 19 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు నకలుతో పాటు స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్లు ఈ నెల 16 నుంచి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని వెల్లడించారు.

17 మద్యం దుకాణాలకు లాటరీ



లాటరీ తీస్తున్న ఆర్డీఓ లక్ష్మీప్రసన్న

ఒంగోలు సిటీ: జిల్లాలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన 17 మద్యం దుకాణాలకు సోమవారం ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో లాటరీ నిర్వహించారు. జిల్లాలో మొత్తం 171 మద్యం దుకాణాలకుగానూ వాటిలో 10 శాతం .. అనగా, 17 షాపులను కల్లుగీత కార్మికులకు కేటాయించిన విషయం తెలిసిందే. వీటికి నోటిఫికేషన్ విడుదల చేయగా, జిల్లా వ్యాప్తంగా 159 దరఖాస్తులు వచ్చాయి. ఒంగోలు కార్పొరేషన్ నుంచి అత్యధికంగా 22 దరఖాస్తులు రాగా, పీసీ పల్లి నుంచి అతి తక్కువగా మూడు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న సమక్షంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లాటరీ ప్రక్రియ కొనసాగింది. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఖాజా మొహిద్దీన్ పాల్గొన్నారు.

బి.ఎడ్ పరీక్ష కేంద్రాల ఆకస్మిక తనిఖీ

ఒంగోలు సిటీ: తొలిరోజు బి.ఎడ్ పరీక్షలను ఆంధ్రకేసరి యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కె.వి.ఎన్.రాజు మార్కాపురం ప్రాంతంలోని కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి డిగ్రీ కళాశాల, వేమన డిగ్రీ కళాశాల, ఐడియల్ అండ్ కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలో 110 బి.ఎడ్ కళాశాలలు ఉన్నాయన్నారు. మొత్తం 11,279 మంది విద్యార్థులకు రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ కోసం 40 పరీక్ష కేంద్రాలను, 16 నోడల్ కేంద్రాలను ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరీక్షల విభాగం అధికారులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలను సజావుగా, సక్రమంగా నిర్వహించేందుకు, పర్యవేక్షించేందుకు ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒక్కొక్క పరిశీలకునితో పాటు రెండు స్క్వాడ్ బృందాలను యూనివర్శిటీ అధికారులు నియమించినట్లు తెలిపారు. పరీక్షలు జరుగుతున్న తీరు తెన్నులను నిశితంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రాలలో తాగునీరు, ఇతర అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు తప్పనిసరిగా మౌలిక వసతులు కల్పించాలని యూనివర్శిటీ పరిధిలోని అన్ని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, యాజమాన్యాలకు రాజు సూచించారు. ఆయన వెంట ఆంధ్రకేసరి యూనివర్శిటీ పీజీ కో ఆర్డినేటర్ (నాన్ కాన్ఫిడెన్షియల్ విభాగం) డాక్టర్ ఆర్.శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

కొండపి నియోజకవర్గం అక్రమ దందాలకు అడ్డాగా మారింది. కూటమి పెద్దల అండదండలతో ఇసుక, గ్రావెల్, మద్యం అక్రమాలే కాదు.. పేకాట, కోడి పందేలు సైతం జోరుగా సాగుతున్నాయి. వీటి కారణంగా అనేక కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి. పోలీసులు సైతం చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు ఆడిందే ఆటగా మారింది. నియోజకవర్గంలో పేకాట శిబిరాల్లో జరుగుతున్న దారుణాలపై ఎస్పీకి ఫిర్యాదు చేయడం నియోజకవర్గంలో పరిస్థితికి అద్దం పడుతోంది.

పేకలు పచ్చాట!



- కొండపిలో జోరుగా పేకాట, కోడి పందేలు
- పచ్చతమ్ముళ్ల పర్యవేక్షణలో జూద క్రీడలు
- మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్న పోలీసులు
- రోజుకో ప్రాంతంలో శిబిరాలు
- ఎస్పీకి నేరుగా ఫిర్యాదు చేసిన బాధితుడు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొండపి నియోజకవర్గంలో అక్రమాలకు అంతేలేకుండా పోతోంది. ప్రధానంగా పేకాట, కోడిపందేల కేంద్రాలకు అడ్డులేకుండా పోయింది. వీటి నిర్వహణకు కూటమి పెద్దల అండదండలు పుష్కలంగా ఉండటంతో పాటు వారి అనుయాయుల ఆధ్వర్యంలోనే శిబిరాలు నిర్వహిస్తుండడంతో అధికారులు సైతం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏ అధికారి అయినా తమ దందాలకు అడ్డుపడితే అధినేతల నుంచి మండలంలో పనిచేస్తావా లేక వేరే మండలానికి బదిలీ అవుతావా అని బెదిరింపులకు దిగుతుండడంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో వెనకడుగు వేస్తున్నారు. ఇదిలా ఉండగా విధినిర్వహణలో నిర్లక్ష్యం వద్దని, పేకాట, కోడి పందేల శిబిరాలను అరికట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా స్థానికంగా ఉన్న నేతల ఒత్తిళ్లతో వారు ఏమీ చేయలేక మిన్నకుండిపోతున్నారు. కొంత మంది మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జోరుగా పేకాట కేంద్రాలు...

నియోజకవర్గంలోని దాదాపు అన్ని మండలాల్లో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నా ప్రధానంగా టంగుటూరు, మద్దిపూడి మండలాల్లో పెద్ద ఎత్తున దందా జరుగుతున్నట్టు సమాచారం. టంగుటూరు మండలం కొణిజేడు కొండల్లో ప్రతిరోజూ భారీగా పేకాట కేంద్రాలు నిర్వహిస్తున్నారని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు కోతముక్క ఆడుతున్నారని ఆ ప్రాంత ప్రజలు ఏకంగా ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారంటే ఇక్కడ పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. కొణిజేడుకు చెందిన పచ్చనేత సహకారంతో పేకాట కేంద్రం నిర్వహిస్తున్నారు.

దాడులు చేయకుండా పోలీసులకు నెలకు రూ.20 వేలు ముట్టజెబుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. మామూళ్లు తీసుకుంటున్న వారు ఉన్నతాధికారుల ఆదేశాలతో దాడికి వచ్చేటప్పుడు ముందస్తు సమాచారం ఇస్తూ సహకరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల సూచనల మేరకు నిర్వాహకులు శిబిరాలను రోజుకో ప్రాంతంలో నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. ఈ శిబిరాలకు పొరుగు ప్రాంతాలకు చెందిన ఒంగోలు, చీమకుర్తి, కొత్తపట్నం తదితర ప్రాంతాల నుంచి పేకాట రాయుళ్లు పెద్ద ఎత్తున వస్తున్నట్టు సమాచారం.

భారీ శిబిరాలను వదిలి...

నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న పేకాట, కోడి పందేల శిబిరాలను కాదని పోలీసులు చిన్నచిన్న శిబిరాలపై దాడులు చేస్తూ మమ అనిపిస్తున్నారు. సింగరాయకొండ, కొండపి, పొన్నలూరు, జరుగుమల్లి మండలాల్లో అడపాదడపా దాడులు నిర్వహించి మొక్కుబడిగా కేసులు బనాయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏదేమైనా నియోజకవర్గంలో పేకాట కేంద్రాలను, కోడి పందేలను పూర్తిగా అరికట్టాలని ప్రభుత్వానికి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్పీకి ఫిర్యాదు...

టంగుటూరు మండలం కొణిజేడు సమీపంలో భారీ ఎత్తున పేకాట దందా జరుగుతోందని ఓ వ్యక్తి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. నియోజకవర్గ టీడీపీ నాయకుల అండదండలతో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నారని, ఈ విషయాన్ని నిర్వాహకులే బహిరంగంగా చెబుతున్నారని ఎస్పీ దృష్టికి తెచ్చారు. ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకూ పేకాట శిబిరం జరుగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని సదరు వ్యక్తి కోరారు.

భారీ వడ్డీలకు డబ్బులు...

కోతముక్క ఆడించటంతో పాటు పేకాటలో అప్పు కావాల్సిన వారికి భారీ ఎత్తున వడ్డీకి డబ్బులిస్తున్నట్టు సమాచారం. రూ.100కు రూ.10 నుంచి రూ.15 వరకూ వడ్డీకి ఇస్తున్నారు. దీంతో ప్రతిరోజూ సుమారు లక్ష రూపాయల వరకు లబ్ధి పొందుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. కంప్యూటర్ ద్వారా పేకాట నిర్వహించి మోసానికి పాల్పడుతున్నారని, లక్షల రూపాయలు పోగొట్టుకున్నామని బాధితులు ఆరోపిస్తున్నారు. టంగుటూరు మండల కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం, రెవెన్యూ కార్యాలయం వద్ద గల పోతుల చెంచయ్య కాలనీలో కూడా కోతముక్క కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వెంకటాయపాలెం గ్రామ సముద్రతీరంలో కోడిపందేలు ఆడిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. మద్దిపూడి మండలంలో శివరాయునిపేట, కాకర్ల, చిలంకూరు, కె.అగ్రహారం, నరసరాజుపాలెం, అయ్యపరాజుపాలెం, మద్దిపూడి మండల కేంద్రంలో కొండ కింద జోరుగా పేకాట సాగుతోంది. అయితే, పోలీసుల దాడులు జరగకుండా ఎక్కడికక్కడ తమ అనుయాయులను ఏర్పాటు చేసుకుని వారి పర్యవేక్షణలో కోతముక్క నిర్వహిస్తున్నారని, ఒకవేళ పోలీసులు దాడులు నిర్వహించే ప్రయత్నం చేసినప్పటికీ వారు వచ్చేలోపు ఇన్ఫార్మర్లు ఇస్తున్న సమాచారంతో తప్పించుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మద్దిపూడి మండలంలో అయితే ఒక పచ్చనేత పేకాట కేంద్రం వద్ద వడ్డీ వ్యాపారం చేసి చివరికి డబ్బు వసూలు కాకపోవడంతో బుద్ధిగా వ్యాపారం చేసుకుంటున్నాడు.

బాలకార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి



చర్చి సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



వెట్టిచాకిరి నిర్మూలన ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ:

బాలకార్మికులు లేని జిల్లాగా ప్రకాశం జిల్లాను తీర్చిదిద్దాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 9న బాలల వెట్టి చాకిరి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ, జిల్లా కార్మిక శాఖ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రకాశం భవనం వద్ద నుంచి అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ, చర్చిసెంటర్లో మానవహారం నిర్వహించారు. అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రతిజ్ఞ చేయించి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలలకు వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలపై ఉందన్నారు. బాలలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే కార్మిక శాఖ, బాలల కోసం ఏర్పాటు చేయబడిన స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు గుర్తించి పనిలో పెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. బాలలకు బంగారు బాల్యం అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వెట్టి చాకిరిని సంపూర్ణంగా నిర్మూలించడమే లక్ష్యంగా అవగాహన కోసం మనమంతా నడుంబిగిద్దామని అన్నారు. ఏ పరిశ్రమలో వెట్టిచాకిరి ఉందో గుర్తించడంతో పాటు దాని నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమ ఏదైనాగానీ.. ముందుగా డబ్బు ముట్టజెప్పడం ద్వారా వ్యక్తులను నియమించుకునే పద్ధతి మానుకోవాలన్నారు. మనదేశంలోని చిట్టచివరి వెట్టి చాకిరి కార్మికులను సైతం రక్షించేందుకు వారికి పూర్తిస్థాయి పునరావాసం కల్పించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ నేరంలో ప్రమేయం కలిగిన వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు ప్రయత్నిస్తామన్నారు. వెట్టిచాకిరి నిర్మూలన చట్టం అమలు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను వెట్టిచాకిరి రహిత రాష్ట్రంగా మారుస్తామన్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా సంపన్నమైన జీవితం గడిపేలా చూస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నామన్నారు. అనంతరం బాలల వెట్టి చాకిరి నిర్మూలన అవగాహన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈఓ అత్తోట కిరణ్ కుమార్, జిల్లా ఉప కార్మిక శాఖాధికారి గాయత్రి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కే వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వి.సాగర్, ఒంగోలు డిప్యూటీ విద్యాశాఖ అధికారి చంద్రమౌళీశ్వరరావు, ఒంగోలు ఎంఈఓ కిషోర్‌బాబు, సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్. సునీల్ కుమార్, జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్ కుమార్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

కంది పైరు, కంచె దగ్ధం

- రూ.లక్ష నష్టం
- గిట్టనివారే నిప్పుపెట్టి ఉంటారంటున్న రైతు

సీఎస్ పురం (పామూరు): కంది పైరు చుట్టూ ఏర్పాటు చేసిన ముళ్ల కంచె దగ్ధమైంది. దాంతో పాటు కొంత మేరకు కంది పైరు కూడా కాలిపోయింది. ఈ ఘటన ఆదివారం రాత్రి సీఎస్ పురం మండలంలోని అంబవరం కొత్తపల్లె వద్ద చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బసిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి అనే రైతు జాతీయ రహదారి పక్కన 10 ఎకరాల్లో కంది పంట సాగుచేశాడు. పందులు, పశువుల నుంచి పంటను కాపాడేందుకు పొలం చుట్టూ చిల్లకంపతో కంచె ఏర్పాటు చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు కంచెకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి కాలిపోయింది. సమీపంలోని వారు పొలం యజమాని వెంకట సుబ్బారెడ్డికి ఫోన్ చేసి చెప్పారు. అతను అక్కడికి చేరుకునేసరికే పూర్తిగా కంచెతో పాటు అక్కడక్కడా కంది పైరు కూడా కాలిపోయింది. కనిగిరి అగ్నిమాపక శాఖకు తెలియజేయగా, ఫైర్ ఆఫీసర్ బంగారు బాబు ఆధ్వర్యంలో ఫైరింజన్‌తో సిబ్బంది వచ్చారు. సుమారు 5.30 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. చుట్టుపక్కల పొలాలకు మంటలు వ్యాపించకుండా ఆర్పివేశారు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు. గ్రామంలో తమకు గిట్టనివారే కంచెకు నిప్పుపెట్టి ఉంటారని రైతు అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.



కందిపైరుకు వేసిన కంచె మంటల్లో కాలిపోతున్న దృశ్యం

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఒంగోలు విద్యార్థుల సత్తా

ఒంగోలు: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఒంగోలు విద్యార్థులు సత్తా చాటారు. విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉదయం ప్రారంభమై అర్ధరాత్రి దాటేంత వరకు జరిగిన ఈ పోటీల్లో పలు విభాగాలలో ఒంగోలు హైదరీ క్లబ్ సిద్దార్థ కరాటే అకాడమీ విద్యార్థులు బంగారు, వెండి, రజిత పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరవగా, కరాటే అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.మిల్టన్ శాస్త్రి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రకాశం జిల్లా కార్యదర్శి నల్లూరి మోహనరావు పాల్గొని బంగారు పతకాలు కైవసం చేసుకున్న విద్యార్థులు, వారికి శిక్షణ ఇచ్చిన సిద్దార్థ కరాటే కోచ్‌లు వి.వెంకటేశ్వర్లు, వి.అనిల్, పీవీ సుబ్రహ్మణ్యం, సయ్యద్ శేషావలి, వి.చాంద్‌బాషాలను ప్రత్యేకంగా అభినందించారు.

కుమితే విభాగంలో విజేతలు...

75 కేజీల పురుషుల విభాగంలో ఎం.రామకృష్ణ (బంగారు పతకం), అండర్-21 విభాగంలో కె.యశ్వంత్ (74 కేజీలు-వెండి పతకం), ఎస్.మహేంద్ర (84 కేజీలు-వెండి), కుమితే క్యాడెట్ విభాగంలో జి.మణికంఠ (60 కేజీలు- వెండి), వేదాస్ అఖిల్ (అండర్-10 విభాగం కటా సిల్వర్ మెడల్, టీమ్ కటా గోల్డ్ మెడల్, కుమితే-35 కేజీలు గోల్డ్ మెడల్) విజయం సాధించారు. ఎం.నిఖిల్ సాయి టీమ్ కటా గోల్డ్ మెడల్, అండర్-11 కుమితే 45 కేజీలు గోల్డ్, టీ.వరుణ్‌తేజ్-టీమ్ కటా గోల్డ్, ఆర్.హర్ష-టీమ్ కటా గోల్డ్ మెడల్, ఎస్.గోపిక అండర్-12 విభాగంలో కటా బ్రాంజ్, టీమ్ కటా గోల్డ్ మెడల్, 30 కేజీల కుమితే విభాగంలో గోల్డ్, హార్ధిక 11 సంవత్సరాల విభాగంలో కటా బ్రాంజ్, టీమ్ కటా గోల్డ్, హాసిక అండర్-11 విభాగంలో టీమ్ కటా గోల్డ్ మెడల్, జి.వసుమ అండర్-10 విభాగంలో కటా బ్రాంజ్, హిమజ్ఞ అండర్-13 విభాగంలో కటా బ్రాంజ్, నైనిక అండర్-13 విభాగంలో కటా సిల్వర్ మెడల్‌ను అతిథుల చేతుల మీదుగా కైవసం చేసుకున్నారు.



రాష్ట్రస్థాయి కుమితే విభాగంలో బంగారు పతకం అందుకుంటున్న రామకృష్ణ

సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- మీ కోసం కార్యక్రమానికి 232 అర్జీలు

ఒంగోలు సిటీ:

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 232 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీ కోసం అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలని సూచించారు. పిటీషన్లు రీ ఓపెన్ కాకుండా చూడాలని చెప్పారు. అర్జీల పరిష్కారంలో సహేతుకత ముఖ్యమన్నారు. మొక్కుబడి సమాధానాలతో అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇచ్చేసి సమస్యను పరిష్కరించినట్లు రికార్డుల్లో చూపితే సహించబోనన్నారు. క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారం కావాల్సిందేనని, పరిష్కరించలేని పక్షంలో అందుకు కారణాలను కూడా అర్జీదారులకు వివరించాలని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ బి.చినఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పార్థసారథి, వరకుమార్, జాన్సన్, విజయ జ్యోతి, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కొలతలు వేసి అక్రమ మైనింగ్ తేల్చాలి...

బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం యర్రబాలెం గ్రామ నివాసి మొరవినేని పవన్‌కుమార్ మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అర్జీ అందజేశారు.

ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం బూరేపల్లి గ్రామంలో ప్రభుత్వానికి సంబంధించిన కొండ ఉందని, అక్కడ అక్రమ మైనింగ్ జరుగుతోందని ఫిర్యాదు చేశారు. తేదీ 16.12.2024న కూడా దీనిపై తాను అర్జీ ఇచ్చానని తెలిపారు. అప్పుడు డిసెంబరు 23వ తేదీ మైనింగ్ వారు వచ్చి అక్రమ మైనింగ్ జరిగిందని తాత్కాలికంగా ఒక నివేదిక ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం మళ్లీ మైనింగ్ జరుగుతోందన్నారు. దీనిపై గత జనవరి 27వ తేదీ జాయింట్ కలెక్టర్‌కు తెలపగా, అక్కడకు వెళ్లి మైనింగ్ ఎంత జరిగిందో కొలతల ద్వారా నివేదిక ఇవ్వాలని డీడీని ఆదేశించారు. కానీ, 15 రోజులు గడుస్తున్నా నేటికీ ఎవరూ రాలేదన్నారు. ఇది మూడు ఊర్ల సమస్య అని తెలిపారు. యర్రబాలెం, బూరేపల్లి, అన్నంగి గ్రామాల్లో గొర్రెల కాపర్లు, గేదెలు మేపుకునే వారు మైనింగ్‌తో ఎంతో ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. అందువలన అక్రమ మైనింగ్ జరగకుండా ఆపాలని కోరారు. అక్కడ అక్రమ మైనింగ్ ఎంత జరిగిందో తెలుసుకోవాలంటే కొలతలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కొలతలు వేసి అక్రమ మైనింగ్‌ను తేల్చాలని కోరుతూ పవన్‌కుమార్ కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

రైతులు అనుమానాలు నివృత్తి చేసుకోవాలి

ఒంగోలు సిటీ: జిల్లాలోని రైతులు తమకు వచ్చిన అనుమానాలను, సందేహాలను, సమస్యలను నివృత్తి చేసుకునేందుకు 85006 80073 నంబర్‌ను సంప్రదించాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ యు.భాస్కరరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలు రీసర్వేలో వస్తున్న సమస్యలు, అనుమానాలు ఎలా పరిష్కరించుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారికి వస్తున్న సందేహాలు నివృత్తి చేసుకునేందుకు ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ఒక ఎక్స్‌పర్ట్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయంలో, సర్వే శాఖ కార్యాలయంలో ఒక ఎక్స్‌పర్ట్ టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ టీం పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

గిద్దలూరులో చైన్ స్నాచింగ్

గిద్దలూరు రూరల్: మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు లాక్కెళ్లిన సంఘటన గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని నంద్యాలరోడ్డులో గల జగనన్న కాలనీ వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రోడ్డు పక్కన చిరువ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్న నారాయణమ్మ అనే మహిళ వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. వస్తువులు కొనుగోలు చేసిన సదరు దుండగుడు ఆమెతో మాటలు కలిపి హఠాత్తుగా మెడలోని మూడు తులాల బంగారు గొలుసు లాక్కుని బైక్‌పై పారిపోయాడు. బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

● రూ.5 లక్షలకు పైగా నష్టం


కాలిపోతున్న పొగాకు బ్యారన్

వెలిగండ్ల(కనిగిరిరూరల్): ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన సోమవారం తెల్లవారుజామున వెలిగండ్ల మండలంలోని పాపిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు మారం వెంకట సుబ్బారెడ్డి బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో పొగాకు అల్లిక కర్ర జారి మొద్దు గొట్టంపై పడటంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారి బంగారు బాబు తన సిబ్బందితో వచ్చి మంటలు అదుపుచేశారు. అయితే అప్పటికి బ్యారన్‌లో ఆకు, కర్ర, టైర్లు తదితర సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వెంకట సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

లారీని ఢీకొని యువకుడు దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన మోహన్ వంశీ కృష్ణ ఇన్‌సెట్‌లో మోహన్ వంశీ కృష్ణ(ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివ ఇన్‌సెట్‌లో మృతుడు వేమా నాగార్జున(ఫైల్)

సింగరాయకొండ: జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సింగరాయకొండలోని కలికవాయ ఫ్లయ్‌ఓవర్ దిగువన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని బాలయోగినగర్‌కు చెందిన కూరపాటి మోహన్ వంశీకృష్ణ(23) కందుకూరులోని వివేకానంద కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఖాళీ సమయంలో కె.బిట్రగుంట వద్ద గల పాల ఫ్యాక్టరీలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి పాల ఫ్యాక్టరీకి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో కలికవాయ ఫ్లయ్‌ఓవర్ దిగువనఆగి ఉన్న లారీని వెనుక నుంచి వంశీ ఢీకొట్టాడు. పంక్చరైన టైరు మార్చుకునేందుకు రోడ్డు మార్జిన్‌లో లారీని నిలపగా వేగంగా వెళ్తున్న క్రమంలో వంశీ గమనించకపోవడంతో ప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు లారీ డ్రైవర్‌గా, తల్లి నాగమణి స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లి రోదిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది. టంగుటూరు హైవే మొబైల్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

బైక్ అదుపుతప్పి మరో యువకుడు..

కురిచేడు: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కురిచేడు మండలంలోని బోదనంపాడు సమీపంలో బందిళ్ల బావి వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎం.శివ కథనం ప్రకారం.. బోదనంపాడు గ్రామానికి చెందిన వేమా నాగార్జున(32) వ్యక్తిగత పని నిమిత్తం తన బైక్‌పై దర్శికి బయలుదేరాడు. గ్రామ శివారులోని బందిళ్ల బావి వద్ద బైక్ అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి హద్దురాయిని ఢీకొట్టాడు. దీంతో నాగార్జున తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య ఉంది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై ఏకాగ్రత


విద్యార్థినితో ఆల్బెండజోల్ మింగిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నపుడే చదువుపై ఏకాగ్రత సాధ్యమని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బాలబాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయలో చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఆరు నెలలకోసారి విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 19 ఏళ్లలోపు విద్యార్థులు 5,96,751 మంది ఉండగా 6,80,000 మాత్రలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. భోజనానికి ముందు, కాలకృత్యాల తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతుల శుభ్రత విధానంపై అవగాహన కల్పించారు. అనివార్య కారణాలతో సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు మింగని విద్యార్థులకు ఈ నెల 17వ తేదీన మాత్రలు పంపిణీ చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, ఆర్‌ఐఓ సైమన్ విక్టర్, డీఈఓ ఎ.కిరణ్ కుమార్, ప్రిన్సిపాల్ వీకే గీతాలక్ష్మి, వైద్యులు పద్మజ, వాణిశ్రీ, ఖాశిం, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 69 ఫిర్యాదులు

ఒంగోలు సబర్బన్: బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 69 మంది బాధితులు ఎస్పీ ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఒంగోలు నగర శివారులోని కార్గిల్ పెట్రోల్ బంకు ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న వైద్యశాలకు ఆనుకుని ఉన్న తమ ప్లాట్లను కొందరు తమవి అంటూ బెదిరిస్తున్నారని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి పలగాని రామసుబ్బారెడ్డి ఫిర్యాదు చేశారు. కొంతమంది రిటైర్డ్ ఉద్యోగులం కలిసి ప్లాట్లు కొనుగోలు చేయగా అమ్మిన వ్యక్తి డబుల్ రిజిస్ట్రేషన్లు చేసి వేధిస్తున్నాడని వాపోయారు. 30 శాతం ఆదాయం వస్తుందని ఓ యాప్ ద్వారా ఆశ చూపి విడతలవారీగా రూ.11.80 లక్షలు తీసుకుని మోసం చేశారని ఒంగోలు బాలాజీ నగర్‌కు చెందిన వ్యక్తి వాపోయాడు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చట్ట పరిధిలో త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కాగా ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, భర్త–అత్తారింటి వేధింపులు, చీటింగ్, ఉద్యోగాల పేరుతో మోసం, భూ వివాదాలే అధికంగా ఉన్నాయి.

పచ్చనేతల పైశాచిక ఆనందం

● దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి అడ్డంగా లోకేష్ ఫొటోతో ఫ్లెక్సీ
● ఏర్పాటు చేసి 20 రోజులు కావస్తున్నా తొలగించని వైనం


మహానేత వైఎస్సార్ విగ్రహానికి అడ్డంగా ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీ

నాగులుప్పలపాడు:

పచ్చనేతలు పిచ్చి పనులు చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఉన్న దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి అడ్డంగా నారా లోకేష్ ఫొటోతో భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జనవరి 23వ తేదీ నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా టీడీపీలోని ఒక వర్గం వారు వేడుకలు నిర్వహించారు. ఆ సమయంలో వేదిక ఏర్పాటు కోసం భారీ ఫ్లెక్సీని మహానేత వైఎస్సార్ విగ్రహం ఎదురుగా ఏర్పాటు చేశారు. కార్యక్రమం అనంతరం కూడా ఫ్లెక్సీ తొలగించకుండా అలాగే ఉంచారు. 20 రోజులు కావస్తున్నా ఫ్లెక్సీ తొలగించకుండా వైఎస్సార్ విగ్రహానికి అడ్డంగా ఉంచడంతో విగ్రహం కనిపించడం లేదు. ఇదంతా గమనిస్తున్న ప్రజలు.. టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే వైఎస్సార్ విగ్రహానికి అడ్డంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని విమర్శిస్తున్నారు. మన ప్రభుత్వమే కదా.. మనల్ని ఎవరడుగుతారులే అనే అహంభావం ప్రదర్శిస్తున్నారు. రాజకీయ పార్టీల విషయంలో సున్నితమైన అంశాలపై కూడా దృష్టి సారించి ఎలాంటి వివాదాలు జరగకముందే స్పందించాల్సిన పోలీసులు కూడా ఈ విషయాన్ని పట్టించుకోకుండా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తున్న టీడీపీ నాయకుల పిచ్చి పనులకు అడ్డుకట్ట వేయాలని ఆ పార్టీలోని మరో వర్గం వారే బహిరంగంగా కోరడం విశేషం.

పేదలకు నివేశన స్థలాలివ్వాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పేదలు

ఒంగోలు సిటీ: అర్హులైన నిరుపేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఒంగోలులో భారత కమ్యూనిస్ట్ పార్టీ, సీపీఐ నగర సమితి అధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ఏళ్ల తరబడి పేదల సొంత ఇంటి కల కలగానే మిగిలిందని విచారం వ్యక్తం చేశారు. ఇతర జిల్లాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చి ఆటో కార్మికులు, ముఠా కార్మికులు, రకరకాల పనులు చేసుకొని జీవనం సాగించే పేద వానికి 2 సెంట్లు స్థలం ఇవ్వటానికి పాలకులు, అధికారులు శ్రద్ధ చూపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్ర వర్ణాలకు, పెత్తందారులకు ప్రభుత్వ భూములు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని ఉన్న కార్మిక నగర్, దత్తాత్రేయ కాలనీ, సరళాదేవి నగర్‌లో నివసించే నిరుపేదలను గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు సీపీఐ పేదల కోసం పోరాడుతుందన్నారు. పేదలకు అండగా ఉంటుందన్నారు. ప్రతి లబ్ధిదారునికి ప్రస్తుత గవర్నమెంట్ ఇచ్చిన జీవో ప్రకారం 2 సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల గురించి ఆలోచించడం లేదన్నారు. ప్రభుత్వం తమ విధానం మార్చుకొని పేదలకు సహాయ చేసే విధంగా ఉండాలన్నారు. గతంలో ఇచ్చినా పట్టాదారుల్లో అనర్హులను తొలగించి అర్హులైన వారికి 2 సెంట్లు ఇస్తామని వ్యక్తిగత అర్జీలు తీసుకున్నారన్నారు. పార్టీ సీనియర్ నాయకులు సర్దార్, ఎంఏ సాలార్, పోలేరయ్య, ప్రమీల, పోలమ్మ పాల్గొన్నారు .

అహంకారంతోనే ఖబరస్థాన్ స్థలం రద్దు


సమావేశానికి హాజరైన ఆవాజ్ జిల్లా నాయకులు

ఒంగోలు సిటీ: దశరాజుపల్లి ఖబరస్థాన్ స్థలం విషయంలో హైకోర్టు తీర్పును అమలు చేయకుండా అధికారం ఉందనే అహంకారంతో రద్దు చేయడానికి పూనుకోవడం దుర్మార్గమని ఆవాజ్ జిల్లా నాయకుడు పఠాన్ కరీముల్లా విమర్శించారు. సోమవారం స్థానిక ఎల్బీజీ భవన్‌లో దశరాజుపల్లి ఖబరస్థాన్, షాదీ ఖానా తదితర సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆవాజ్ నగర అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆవాజ్ నగర అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేయాల్సిన అవసరం ఏముందో చెప్పాలని ప్రశ్నించారు. ఆరు అడుగుల స్థలం కోసం అధికార తెలుగుదేశం పార్టీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రముఖ న్యాయవాది షేక్ కరీముల్లా మాట్లాడుతూ ముస్లింలతో చర్చించకుండా ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేయాలని నిర్ణయించడం ముస్లింలను అవమానపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేద ముస్లింలను దృష్టిలో ఉంచుకొని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద షాదీ ఖానా నిర్మించారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం షాదీ ఖానాను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం సరైన నిర్ణయం కాదని చెప్పారు. షాదీ ఖానాకు నగర పాలక సంస్థ నెలకు సుమారు 5 లక్షల రూపాయల వరకు నిర్ణయించడం, నిర్వహణ ఖర్చులు కలుపుకొని మొత్తం భారం ముస్లింలపైనే పడుతుందన్నారు. నిరుపేద ముస్లింల పెళ్లిళ్లతో వ్యాపారం చేయాలనుకోవడం దుర్మార్గం అన్నారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు కె. ఎఫ్ బాబు, బి.రఘురామ్, సయ్యద్ ఇస్మాయిల్, గౌస్ బాష, సుభానీ, పఠాన్ మాసూద్ పాల్గొన్నారు.

కోదండ రామయ్యకు పునర్వసు నక్షత్ర పూజలు


విశేష అలంకరణలో సీతారామలక్ష్మణ స్వామి వార్లు

ఒంగోలు మెట్రో: శ్రీరామచంద్రులు వారి జన్మ నక్షత్రం సోమవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రామాలయాల్లో అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. ఒంగోలులో పీవీఆర్ గరల్స్ హైస్కూల్ గడియారం వారి వీధి అనంత కోదండ రామస్వామి మందిరం, ఐశ్వర్య నగర్ రామాలయం, గాంధీ రోడ్డులో అనంత కోదండ రామస్వామి దేవస్థానం, గోపాల్ నగర్లోని రామ మందిరం, సీతారాంపురంలోని సీతా సమేత కోదండరామస్వామి దేవాలయం, మంగమూరు రోడ్డు గాంధీనగర్ మూడో లైన్ సీతా రామలింగేశ్వర స్వామి దేవస్థానం, రామ్‌గర్, మామిడిపాలెం, గద్దలగుంట, రామాలయాల్లో, స్వామి అమ్మవార్ల మూలవిరాట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోదండరామస్వామి వారి దేవస్థానం (రామక్షేత్రం) వలేటివారిపాలెం పునర్వసు నక్షత్రం సందర్భంగా శ్రీ కోదండరామ స్వామి వారికి ప్రాతకాలమున పంచామృత అభిషేకం వైభవంగా జరిగింది. విశ్వక్సేన ఆరాధన పుణ్యాహ వాచన ద్రవ్య ఆరాధన జరిపి స్వామికి పంచామృతాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇంటింటా ప్రచారం విజయవంతం చేయాలి

ఈతముక్కల (కొత్తపట్నం): పుట్టిన పిల్లలు, వికలాంగ పిల్లల సంక్షేమం కోసం ఇంటింటా ప్రచారం విజయవంతం చేయాలని ప్యానల్ న్యాయవాది ధనలక్ష్మి పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా ఈతముక్కల హైస్కూల్లో పిల్లలు, వికలాంగ పిల్లల సంక్షేమ కోసం విద్యార్థులతో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి ఆదేశాలు మేరకు ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీసెస్ అథారిటీ రెండు వారాల పాటు అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ఇంటిగ్రేటెడ్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఈతముక్కలలో ప్రారంభించారు. ఈ నెల 10 నుంచి 24 వరకు కొత్తపట్నం మండలంలో జరపునున్నట్లు తెలిపారు. జిల్లా న్యాయ సేవా సదన్ నియమించిన అధికార ప్యానల్ లాయర్ ధనలక్ష్మి, పారా లీగల్ వాలంటీర్ శింగమనేని ఆంజనేయులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి, ఆశా వర్కర్లు టీమ్‌గా ఏర్పడి ఇంటింటా ప్రచారం చేస్తారు.


వికలాంగ పిల్లల సంక్షేమం గురించి అవగాహన కల్పిస్తున్న డాక్టర్

ఆధార్ తరహాలో రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య


మాట్లాడుతున్న ఏవో కిషోర్‌బాబు

ఒంగోలు సిటీ: వ్యవసాయరంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఆధార్ తరహాలో అందించనుందని ఏవో కిషోర్‌బాబు తెలిపారు. సోమవారం ఒంగోలు మండలంలోని అధికారులతో ఆయన మాట్లాడారు. 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య గురించి పలు విషయాలు సమావేశంలో వివరించారు.

బాలగురవమ్మకు చుండూరు నివాళి


బాలగురవమ్మకు నివాళులర్పిస్తున్న చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు మాతృమూర్తి బాలగురవమ్మ ఆదివారం సాయంత్రం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆమె భౌతిక కాయాన్ని ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు సందర్శించి పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు. అనంతరం ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, బీసీ సెల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు రవీంద్రనాథ్‌రెడ్డి, కార్తీక్, దేవా, జనార్దన్, మేరీ, ప్రసన్న, వైఎస్సార్ సీపీ నాయకులు మృతురాలు బాలగురవమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

మద్దిపాడు: మండలంలోని రెండు సంవత్సరాల వయసు నుంచి 17 సంవత్సరాల వయసు వరకు ఉన్న విద్యార్థులకు సోమవారం జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు అందించి మింగించారు. మండలంలోని లింగంగుంట గ్రామంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన అనంతరం ట్యాబ్లెట్లు అందించి మింగించారు. మండలంలో మొత్తం 9,171 మంది విద్యార్థులు ఉండగా, వారిలో 8,805 మందికి మాత్రలు అందించినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. మిగిలిన వారికి 17వ తేదీ మాత్రలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్‌ఓ రజిత కుమారి, సూపర్‌వైజర్లు బాలకోటయ్య, నాగరాజి, ఎంఎల్‌హెచ్పీ రమ్య, ఏఎన్‌ఎం కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీమకుర్తి రూరల్: మండలంలోని 17 సచివాలయాల పరిధిలో సోమవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఇలపావులూరు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అప్సర్ పాల్గొన్నారు. మండలంలో మొత్తం 6,370 మంది విద్యార్థులు ఉండగా, వారిలో 6050 మందికి 96 శాతం నులిపురుగుల మాత్రలు అందించారు.

కొత్తపట్నం: నులిపురుగుల మాత్రలు వేసుకుంటే నులి పురుగులు చనిపోవడమేగాక సంపూర్ణ ఆరోగ్యానికి ఉపయోగపడతాయని ఈతముక్కల, కొత్తపట్నం పీహెచ్ డాక్టర్లు నవ్యరెడ్డి, వైష్ణవి అన్నారు. కొత్తపట్నం, ఈతముక్కల పీహెచ్ పరిధిలో సోమవారం నులిపురుగుల మందులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల విద్యార్థులతో పాటు గర్భిణులకు ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు పంపిణీ చేశామన్నారు. మండలంలో ఉన్న 15 పంచాయతీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎంపీపీ స్కూల్స్, యూపీ స్కూల్స్, ప్రైవేటు స్కూల్స్, అంగన్‌వాడీ సెంటర్లు, గర్భిణులకు మాత్రలు మింగిచినట్లు చెప్పారు. రెండు పీహెచ్‌సీ పరిధిలో 10,698 మందికి మందికి మింగించాలని లక్ష్యంగా పెట్టుకోగా 10,314 మందికి మింగించాలమని చెప్పారు. డాక్టర్ రమ్యదీపిక, సీహెచ్‌వో ఓంకార్, సూపర్‌వైజర్ సులోచన, ఎంఎల్‌హెచ్‌పీ (సీహెచ్‌వో)లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.